సాక్షి
విశాఖపట్నం
సోమవారం ౹ 3 ౹ ఫిబ్రవరి ౹ 2025

క్యాన్సర్‌పై అవగాహన నడక



వాక్‌థాన్‌లో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు, యువత

8లో

కంగ్రాట్స్ షబ్నమ్



ఫైనల్ మ్యాచ్‌లో వికెట్ తీసిన ఆనందంలో షబ్నమ్

- టీ-20 అండర్-19 మహిళల ప్రపంచ కప్ విజేత భారత్
- పేస్ బౌలర్‌గా సత్తా చాటిన విశాఖ అమ్మాయి

భారత యువ క్రికెట్ జట్టు టీ-20 అండర్ – 19 మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. ఈ విజయంలో విశాఖకు చెందిన పేస్ బౌలర్ షబ్నమ్ కీలక పాత్ర పోషించింది. షబ్నమ్ తన అద్భుతమైన బౌలింగ్‌తో ప్రత్యర్థులను కట్టడి చేసింది. కీలకమైన ఫైనల్ మ్యాచ్‌లో ఆమె కచ్చితమైన లైన్, లెంగ్త్ బంతులు విసిరి బ్యాటర్లను ఇబ్బంది పెట్టింది. – విశాఖ స్పోర్ట్స్

ఎనిమిదేళ్ల ప్రాయంలో సరదాగా తండ్రితో రన్నింగ్ చేయడానికి వెళ్తూ అక్కడ క్రికెట్ ఆడుతున్న అమ్మాయిల్ని చూసింది షబ్నమ్. అలా క్రికెట్‌పై మక్కువ పెంచుకుంది. ఆమె తండ్రి షకీల్ క్రికెట్ ఆటగాడు కావడంతో.. షబ్నమ్ ఆసక్తిని గమనించి ఆటలో ప్రాథమిక మెళకువలు నేర్పించారు. అనంతరం జాతీయ క్రికెట్ అకాడమీలో మెళకువలు తోడవడంతో అంతర్జాతీయ స్థాయిలో చెలరేగే బంతులేసే స్థాయికి ఎదిగింది. కెరీర్ ప్రారంభించి పదేళ్లలోనే జాతీయ అండర్-19 జట్టులో స్థానం సంపాదించిన షబ్నమ్.. భారత్ పర్యటనలో భాగంగా న్యూజిలాండ్ మహిళా అండర్-19 జట్టు సిరీస్‌లో తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడింది. నేడు మహిళల టీ-20 అండర్ 19 వరల్డ్ కప్‌ను రెండోసారి భారత్ జట్టు అందుకోగా.. రెండుసార్లు విశాఖకు చెందిన షబ్నమ్ పేస్‌తో బెంబేలెత్తించిన పాత్ర గర్వించదగ్గది.

2019లో జిల్లాకు ప్రాతినిధ్యం

శిక్షణ శిబిరంలో నేర్చుకున్న ఆటతో 2019లో అండర్-16లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి షబ్నమ్ చేరుకుంది. వేసవి శిబిరాల్లో జట్టుగా ఆడేటప్పుడే పేస్ బౌలింగ్ వైపు ఆసక్తి పెరిగి పేస్‌లో వేరియేషన్స్‌తో జట్టుకు కీలకంగా మారింది. కరోనాతో శిక్షణ, పోటీలకు బ్రేక్ వచ్చింది. తిరిగి 2022లో పోటీలు ప్రారంభం కావడంతో దేశవాళీ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో ఆడింది. చాలెంజర్ ట్రోఫీతో పాటు స్కూల్ గేమ్స్ నేషనల్స్ అండర్-17 జట్టుకు ఆడింది.

క్వాడ్రేంగులర్ సిరీస్‌లో భాగంగా శ్రీలంక, వెస్టిండీస్‌తో తలపడిన భారత్ బి జట్టు తరఫున రెండు మ్యాచ్‌లు ఆడింది. అనంతరం టీ-20 భారత్ మహిళా అండర్-19 జట్టు తరఫున ఆడే అవకాశం దక్కింది. 2023 అండర్ 19 మహిళల టీ-20 వరల్డ్‌కప్‌లో మూడు మ్యాచ్‌లకే పరిమితమైనా.. అప్పుడు లభించిన అనుభవాన్ని తాజా వరల్డ్‌కప్‌లో చూపించింది. కోలాలంపూర్‌లో జరిగిన వరల్డ్‌కప్‌లో అన్ని మ్యాచ్‌ల్లోనూ ఆడి నాలుగు కీలక వికెట్లు తీసింది. ఫైనల్‌లో దక్షిణాఫ్రికా ఓపెనర్‌ను నిలదొక్కుకోనివ్వకుండా పెవిలియన్‌కు పంపడంతో పాటు జట్టును తక్కువ స్కోర్‌కే పరిమితం చేయడంలో కీలకపాత్ర పోషించింది. 'అండర్-19 మహిళా జట్టుకు ఎంపిక కాగానే నేషనల్ క్రికెట్ అకాడమీలో పేస్‌కు మరింత వేగం పెంచుకునే విధంగా శిక్షణ పొందాను. ఐసీసీ ట్రోఫీని జట్టు అందుకోవడంలో తోటి క్రీడాకారిణుల సహకారంతో నా వంతు పాత్ర పోషించాను.'అని షబ్నమ్ తెలిపింది.

ప్రభుత్వ బడికి ముప్పు

- రేషనలైజేషన్‌తో మూతపడనున్న స్కూళ్లు
- 117 జీవో రద్దు పేరిట కూటమి సర్కార్ కొత్త ఎత్తుగడ
- హైస్కూళ్లలో విలీనం కానున్న ప్రాథమికోన్నత పాఠశాలలు
- మోడల్ స్కూళ్ల పేరిట ప్రైమరీ స్కూళ్లకు గండం
- 100 మందికి పైగా స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్
- బడికి దూరం కానున్న పేద విద్యార్థులు

నగరంలోని బుచ్చిరాజుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రస్తుతం ఒకటి నుంచి 8వ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. 340 మంది విద్యనభ్యసిస్తుండటంతో ఈ పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి.. హైస్కూల్ చేస్తారని అంతా భావించారు. కానీ కూటమి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో యూపీ స్కూల్ కాస్తా ప్రైమరీ స్కూల్‌కే పరిమితం కానుంది. 6, 7, 8 తరగతుల విద్యార్థులు 145 మంది ఉండగా, వీరంతా మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గోపాలపట్నం స్కూల్‌కు వెళ్లాలి. ఎన్‌ఏడీ చుట్టు పక్కల కాలనీల నుంచి వచ్చే విద్యార్థులంతా మరింత దూరంలో ఉన్న గోపాలపట్నం వరకు వెళ్తారా అనేది అనుమానమే. 117 జీవో రద్దు పేరిట కూటమి ప్రభుత్వం ఆడుతున్న డబుల్‌గేమ్‌తో జిల్లాలోని అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ ఇదే జరగనుంది. – విశాఖ విద్య



హైస్కూల్‌లో విలీనం కానున్న బుచ్చిరాజుపాలెం యూపీ స్కూల్



బుచ్చిరాజుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు

ప్రాథమికోన్నత పాఠశాలలు మాయం

ప్రాథమికోన్నత పాఠశాలలను పూర్తిగా రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రభుత్వ యాజమాన్య పరిధిలో జిల్లాలోని 31 ప్రాథమికోన్నత పాఠశాలలు మూతపడనున్నాయి. యూపీ స్కూళ్లను రద్దు చేసి 30 మందికి పైగా విద్యార్థులు ఉన్న చోట ప్రైమరీ స్కూళ్లుగా కొనసాగిస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో 100 మందికి పైగా స్కూల్ అసిస్టెంట్లు మిగిలిపోతారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించడంతో జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు గణనీయంగా తగ్గిపోయాయి. తాజా పరిణామాలతో జిల్లాలోని ప్రాథమికోన్నత పాఠశాలల చరిత్ర ముగిసినట్లే.

మోడల్ ప్రైమరీ స్కూళ్ల పేరిట డ్రామా

నగరంలో వార్డు ప్రాతిపదికన, రూరల్ మండలాల్లో పంచాయతీకి ఒకటి చొప్పున 'మోడల్ ప్రైమరీ స్కూల్' ఏర్పాటు చేయాలనే ఆదేశాలతో జిల్లా యంత్రాంగం ఆగమేఘాల మీద కసరత్తు చేస్తోంది. ఇలా ఏర్పాటు చేసే స్కూళ్లలో 1 నుంచి 5వ తరగతి వరకు నిర్వహిస్తారు. జిల్లాలో 184 మోడల్ స్కూళ్లు ఏర్పాటుకు ప్రతిపాదించినట్లుగా తెలుస్తోంది. విద్యారంగ భవిష్యత్ పేరిట చేస్తున్న కసరత్తుపై ఉపాధ్యాయ వర్గానికి కానీ, విద్యార్థుల తల్లిదండ్రులకు కానీ, అటు ప్రజా ప్రతినిధులకు కూడా తెలియనివ్వకుండా అంతా గోప్యత పాటిస్తుండటం గమనార్హం.

ప్రైమరీ స్కూళ్లకు ఎసరు

పాఠశాల విద్యలో ఇక నుంచి శాటిలైట్ స్కూళ్లు(పీపీ-1,పీపీ-2), ఫౌండేషన్ స్కూళ్లు(పీపీ-1, పీపీ-2, అలాగే 1, 2 తరగతులు), మోడల్ ప్రైమరీ స్కూళ్లు (పీపీ-1,పీపీ-2, అలాగే 1 నుంచి 5 వరకు), హైస్కూళ్లు (6 నుంచి 10 వరకు) ఉండేలా కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై విద్యాశాఖ కమిషనర్ జిల్లాకు వచ్చి అధికారులకు దిశానిర్దేశం చేసి వెళ్లారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్ సైతం పలు దఫాలు విద్యాశాఖాధికారులతో సమీక్షించారు. జిల్లాలో మండల పరిషత్/జెడ్పీ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో 350 ప్రైమరీ స్కూళ్లు, మున్సిపల్ మేనేజ్‌మెంట్ పరిధిలో 95, మత్స్యశాఖ ఆధ్వర్యంలో 1, ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ -1 ఉన్నాయి. వీటిలో ఐదుగురులోపు విద్యార్థులు ఉన్న 25 ప్రైమరీ స్కూళ్లను పూర్తిగా మూసివేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా ఎంపిక చేసిన వాటిలో మినహా, మిగతా ప్రైమరీ స్కూళ్లలో కేవలం 1, 2 తరగతులు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఇలాంటి చర్యలతో నగరంలోని శివారు కాలనీలు, రూరల్ ప్రాంతంలోని గ్రామాల్లో గల ప్రభుత్వ ప్రైమరీ స్కూళ్లు నిర్వీర్యమవుతాయి. ఫలితంగా విద్యార్థులంతా ప్రైవేటు స్కూళ్లు, కాన్వెంట్‌ల వైపు వెళ్తారు. అంతిమంగా ప్రైవేట్ విద్యారంగం బలపడనుంది.

పేదవర్గాలకు చదువులు దూరం



ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విద్యావిధానాల వల్ల నిరుపేద వర్గాల పిల్లలకు చదువులు దూరమవుతాయి. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేకపోతే, వారంతా డ్రాపవుట్‌గా మిగిలిపోతారు. కాస్తో కూస్తో ఆర్థికంగా ఉన్న వారు ప్రైవేటు స్కూళ్లలో చేరుతారు. – టి.ఆర్.అంబేద్కర్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

బేసిక్ ప్రైమరీ స్కూళ్లు ఉండాల్సిందే..



మోడల్ ప్రైమరీ స్కూళ్లు అనేవి మంచివే. కానీ, ప్రైమరీ స్కూళ్లు కూడా యథాతథంగా కొనసాగించాలి. ప్రస్తుతం విద్యార్థులు తక్కువ ఉన్నారనే కారణంతో ప్రైమరీ స్కూళ్లను మూసివేస్తే, భవిష్యత్‌లో విద్యార్థులంతా ప్రైవేటు స్కూళ్లలో చేరతారు. దీనిపై మా సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వినతిపత్రం అందిస్తాం. – కె.నాగేశ్వరరావు, పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి

యూపీ స్కూళ్లు కొనసాగించాలి



ప్రాథమికోన్నత పాఠశాలలను పూర్తిగా రద్దు చేయడం తీవ్రమైన తప్పిదం. దీని వల్ల గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేని పరిస్థితులు ఏర్పడతాయి. దీని వల్ల విద్యార్థులు డ్రాపవుట్‌గా మిగిలే అవకాశం ఉంది. నిరుపేద వర్గాల పిల్లలు కూడా ప్రత్యామ్నాయంగా ప్రైవేటు స్కూళ్లలో చేరాల్సి వస్తోంది. ఇలాంటి చర్యలు ప్రభుత్వ విద్యారంగానికి తీవ్ర నష్టం. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని ఇప్పటికే మా సంఘం రాష్ట్ర నాయకత్వం ద్వారా విన్నవించాం. – ఇమంది పైడిరాజు, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి

చిటికెలో స్కానింగ్

- ఎయిర్‌పోర్టులో బాడీ స్కానింగ్ మెషీన్లు
- శరీరంలో దాగి ఉన్న వస్తువుల్ని సైతం పసిగట్టే వ్యవస్థ
- సంపూర్ణ భద్రతతో పాటు చెకింగ్ వ్యవస్థ పటిష్టం
- ప్రయాణికుడి తనిఖీ సమయం ఆదా

సాక్షి, విశాఖపట్నం : విశాఖ విమానాశ్రయం నుంచి ఎయిర్ కనెక్టివిటీ విస్తరిస్తోంది. డొమెస్టిక్, ఇంటర్నేషనల్ ఆక్యుపెన్సీ 90 శాతం నమోదవుతోంది. భవిష్యత్‌లో ప్రయాణికుల రాకపోకలు, విమాన సర్వీసులు పెరిగే అవకాశం ఉంది. దీంతో భద్రత ప్రమాణాలు, చెకింగ్ తదితర అంశాలపైనా ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే డిజీ యాత్ర సర్వీసు ద్వారా ప్రయాణికుల వివరాల పరిశీలనను వేగవంతం చేసిన ఎయిర్‌పోర్టు.. తనిఖీల సమయాన్ని కూడా తగ్గించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. మేజర్ ఎయిర్‌పోర్టుల్లో ఉన్న ఫుల్ బాడీ స్కానింగ్ యంత్రాలను ఇక్కడ కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

త్వరలో ఏర్పాటు

ఇప్పటికే ఢిల్లీ, బెంగళూరు, ముంబై, కోల్‌కతా మొదలైన ఎయిర్‌పోర్టుల్లో ఉన్న అధునాతన ఇమేజింగ్ వ్యవస్థలైన ఫుల్ బాడీ స్కానర్లను విశాఖపట్నం ఎయిర్‌పోర్టులోనూ ఏర్పాటు చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ స్కానర్ ప్రయాణికుని మొత్తం శరీరాన్ని సెకన్ల వ్యవధిలో స్కాన్ చేస్తుంది. ఈ నేపథ్యంలో ప్రయాణికుల సమయాన్ని ఆదా చేయడంతో పాటు.. వారిని ఇబ్బంది పెట్టకుండా స్కానింగ్ చేసేందుకు ఈ అత్యాధునిక మెషీన్ ఉపయుక్తమవుతుంది.



డిజీ యాత్ర ద్వారా మొబైల్ చెకింగ్

ఎలా పనిచేస్తుందంటే...

- కొందరు ప్రయాణికులు డ్రగ్స్, నిషేధిత వస్తువులను శరీర భాగాల్లో ఉంచి తరలిస్తున్న కేసులు ఇటీవల వివిధ ఎయిర్‌పోర్టుల్లో బయటపడ్డాయి. ఫుల్ బాడీ స్కానర్లు శరీరంలో నిషేధిత వస్తువులు ఎక్కడ ఉన్నా సులువుగా గుర్తించగలవు.
- విమానాశ్రయాలలో విస్తృతంగా ఉపయోగించే మెటల్ డిటెక్టర్లకు భిన్నంగా, ఈ స్కానర్లు పేలుడు పదార్థాలు వంటి లోహేతర వస్తువులను కూడా పసిగట్టేస్తాయి.
- ప్రయాణికుల స్క్రీనింగ్ సమయం 50 శాతం తగ్గుతుంది. ప్రస్తుతం భద్రతా సిబ్బంది ఒక ప్రయాణికుడిని తనిఖీ చేయడానికి దాదాపు 30 నుంచి 45 సెకన్లు పడుతుంది. కానీ.. ఈ అత్యాధునిక స్కానింగ్ మెషీన్‌తో స్క్రీనింగ్ సమయం దాదాపు 15 సెకన్లు మాత్రమే ఉంటుంది.



అత్యాధునిక బాడీ స్కానింగ్ యంత్రాలు

విశాఖ ఎయిర్‌పోర్టులో..

- ప్రతి నెలా సగటు స్వదేశీ ప్రయాణికులు – **2.50** లక్షలు
- ప్రతి నెలా దేశంలోని వివిధ ప్రాంతాలకు విమాన సర్వీసులు– **1,850**
- ప్రతి నెలా సగటు అంతర్జాతీయ ప్రయాణికులు **12,000**
- ప్రతి నెలా దేశంలోని వివిధ ప్రాంతాలకు విమాన సర్వీసులు **82**
- ప్రయాణికుడి తనిఖీకి పట్టే సమయం– **30** నుంచి **45** సెకన్లు
- బాడీ స్కానర్ ద్వారా తనిఖీకి పట్టే సమయం **15** సెకన్లు

- బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ మార్గదర్శకాల ప్రకారం.. వార్షికంగా 10 మిలియన్ల మంది ప్రయాణికులు ప్రయాణించే అన్ని ప్రధాన విమానాశ్రయాలలో పూర్తి బాడీ స్కానర్‌లను ఏర్పాటు చేయాలని భావించారు. కానీ.. త్వరలోనే దాదాపు అన్ని అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుల్లోనూ ఈ బాడీ స్కానర్లు రాబోతున్నాయని విమానాశ్రయ వర్గాలు చెబుతున్నాయి.
- దేశంలోని 130కి పైగా విమానాశ్రయాలను నిర్వహిస్తున్న ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ).. 198 బాడీ స్కానర్‌లని కొనుగోలు చేయాలని భావిస్తోంది.

ఒడిశాకు తరలివెళ్లిన అప్పన్న ప్రచార రథం



రథాన్ని ప్రారంభిస్తున్న ఏఈవో ఆనంద్‌కుమార్

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన ప్రచార రథం ఆదివారం మధ్యాహ్నం ఒడిశాకు తరలివెళ్లింది. ఒడిశాలోని పలు ప్రాంతాల్లో ఈనెల 6 వరకు ప్రచార రథం పర్యటించనుంది. ఒడిశాకి చెందిన లక్ష్మీకాంత్‌నాయక్ దాస్ ఆధ్వర్యంలో బరంపురానికి సమీపంలోని పట్టుపురంలో ఈనెల 3న శ్రీనృసింహహోమం, స్వామి కల్యాణోత్సవం జరుగుతాయి. 4వ తేదీన పద్మనాభపురంలో, 5వ తేదీన విష్ణుచక్రపురంలో శ్రీనృసింహహోమం, కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 6వ తేదీన చికిడీలో కల్యాణోత్సవం అనంతరం ప్రచారరథం తిరిగి సింహాచలం బయలుదేరుతుంది. ముందుగా ప్రచార రథాన్ని దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ ప్రారంభించారు.

నేటి నుంచి టీచర్ ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ

- కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాట్లు
- 11న నామినేషన్ల పరిశీలన

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం సోమవారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. కలెక్టర్ కార్యాలయంలోనే ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ప్రభుత్వ పని వేళల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య నామినేషన్లు దాఖలు చేయొచ్చు. 11న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 13న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మార్చి 3న కౌంటింగ్ జరగనుంది. ఎన్నికల్లో పోటీ చేసే జనరల్ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలి. ఉచితంగా ఇచ్చే దరఖాస్తులను ఇప్పటి వరకు 8 మంది తీసుకున్నారు. 4న మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, 6న పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి, 7న పాకలపాటి రఘువర్మ నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

123 పోలింగ్ కేంద్రాలు : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితా మేరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో మొత్తం 21,555 మంది ఉన్నారు. గత ఏడాది డిసెంబర్ 30న ఓటర్ల తుది జాబితా ప్రకటించారు. చివరి తేదీ అయిన జనవరి 31 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 1,300 దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిశీలన జరుగుతోంది. ఆరు జిల్లాల పరిధిలో పురుష ఓటర్లు 12,948, మహిళా ఓటర్లు 8,607 మంది ఉన్నారు. ఉత్తరాంధ్ర పరిధిలో 123 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. విశాఖలో 13, అనకాపల్లిలో 24, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11, విజయనగరంలో 29, పార్వతీపురం మన్యంలో 15, శ్రీకాకుళంలో 31 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుకు 23 బృందాలను నియమించారు. వివిధ స్థాయి అధికారులతో కూడిన 12 మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు(ఎంసీసీ) బృందాలు, 11 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. వీరు కాకుండా జీవీఎంసీ అదనపు కమిషనర్, జెడ్పీ సీఈవో, భీమిలి, విశాఖ ఆర్డీవోలను నోడల్ అధికారులుగా నియమించారు.

అలలు చెక్కిన శిల్పాలు



బావి మాదిరిగా..



రంగులతో రాళ్ల దిబ్బ



తాబేలు ఆకారంలో..



దీవిలా శిలలు..

విశాఖపట్నం నుంచి భీమిలికి వెళ్లే దారిలో.. తిమ్మాపురం వద్ద సాగరంలో కొన్ని అద్భుతమైన శిల్పాలు ఉన్నాయి. అయితే వీటిని అలలు చెక్కాయి. ఇవి పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కొన్ని శిల్పాలు ఒక చిన్న దీవిలాగా కనిపిస్తాయి. మరికొన్ని వివిధ ఆకారాలను పోలి ఉన్నాయి. ఇంకొన్ని వివిధ రంగుల కలయికతో కట్టిపడేస్తున్నాయి. సముద్రపు అలల మధ్యలో ఇవి ఉండటం వల్ల మరింత అందంగా కనిపిస్తున్నాయి. పర్యాటకులు ఈ రాయిల వద్ద సెల్ఫీలు దిగడానికి ఆసక్తి చూపుతున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

● తీరం పచ్చన.. ఎందువలన?



పెదజాలరిపేట సముద్ర తీరం రంగు మారడం ఆందోళన కలిగిస్తోంది. నిన్న మొన్నటి వరకు నల్లగా కనిపించిన సముద్ర తీరం.. ఇప్పుడు పచ్చగా దర్శనమిస్తోంది. నగరంలో ఏ ఉత్సవం జరిగినా.. ఆ విగ్రహాలను ఇక్కడ తీరంలో నిమజ్జనం చేస్తుంటారు. పూజా సామగ్రిని సముద్రంలో కలిపేస్తుంటారు. గెడ్డల నుంచి వచ్చే వ్యర్థాలు ఇక్కడే సముద్రంలో కలుస్తుంటాయి. విగ్రహాల్లో ఉన్న రంగులు, ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు గెడ్డల నుంచి వచ్చే కలుషిత రసాయనాల కారణంగా ఇసుకపై ఇలా పచ్చటి పొర ఏర్పడి ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇది సముద్ర కాలుష్యానికి ఒక హెచ్చరిక అని వ్యాఖ్యానిస్తున్నారు.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

● కొంగల వి(ఆ)హారం

తిమ్మాపురం సముద్ర తీరం కొంగలకు స్వర్గధామంలా మారింది. ఇక్కడ మత్స్యకారులు చేపలు, రొయ్యలను ఎండబెడుతుంటారు. సాయం సంధ్య వేళ ఆహారం కోసం కొంగలు ఇక్కడ వాలిపోతాయి. తమ పొడవైన ముక్కులతో వాటిని సులభంగా పట్టుకుంటాయి. కాగా.. వందలాది కొంగలు ఒకే చోట చేరి, ఆహారం కోసం వెతుకుతూ, ఎగురుతూ, నీటిలో దిగుతూ ఉంటే చూడ ముచ్చటగా ఉంటుంది. ఎగురుతున్న కొంగల ఫొటోలు తీసుకుంటూ.. సందర్శకులు సంబరపడిపోతారు.

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



కీళ్ల మార్పిడిపై ప్రజల్లో అవగాహన పెంచాలి

- ముగిసిన ఆర్థో వైద్యుల రాష్ట్ర స్థాయి సదస్సు
- ఏపీ ఆర్థోసర్జన్స్ సొసైటీ అధ్యక్షుడిగా డాక్టర్ అశోక్ కుమార్



ఏపీ ఆర్థోసర్జన్స్ సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ అశోక్ కుమార్‌ను అభినందిస్తున్న వైద్యులు

మహారాణిపేట: కీళ్ల మార్పిడి, వాటి అరుగుదల నియంత్రణకు అందుబాటులో ఉన్న నూతన వైద్య విధానాలు, శస్త్ర చికిత్సలపై గ్రామ స్థాయి నుంచి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆర్థోవైద్యుడు డాక్టర్ గురవారెడ్డి అన్నారు. నవ్యాంధ్ర ఆర్థోపెడిక్ సర్జన్ల అసోసియేషన్, ఏఎంసీ, కేజీహెచ్ ఆర్థో విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ పి.శివానంద పర్యవేక్షణలో నాలుగు రోజులపాటు జరిగిన ఆర్థోపెడిక్ సర్జన్ల రాష్ట్ర స్థాయి సదస్సు (ఒసాప్కాన్-2025) ఆదివారంతో ముగిసింది. నగరంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో చివరి రోజు సదస్సులో డాక్టర్ గురవారెడ్డి మాట్లాడుతూ కీళ్ల మార్పిడికి సంబంధించి ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే తగిన ఇబ్బందులు లేకుండా జీవనం సాగించవచ్చన్నారు. ప్రముఖ ఆర్థో డాక్టర్ కృష్ణ కిరణ్ మాట్లాడుతూ జాయింట్ రీప్లేస్మెంట్, హిప్ రీప్లేస్మెంట్ విభాగాలపై కూడా వైద్యులు, వైద్య విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సదస్సులో ఆరు లైవ్ సర్జరీలు, ఐదు వర్క్ షాపులు నిర్వహించగా 150 మంది వైద్య నిపుణులు, వెయ్యి మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతరం ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ నూతన అధ్యక్షుడిగా సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్ కుమార్‌ను ఎన్నుకున్నారు. వచ్చే ఏడాది ఈ రాష్ట్ర స్థాయి సదస్సు కర్నూలులో నిర్వహించాలని నిర్ణయించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎల్ఎస్ లోకనాథ్, డాక్టర్ వర్మ, ప్రముఖ ఆర్థో వైద్యులు వీవీకే, రమేష్ సేన్. విజయ్, అశోక్, ప్రదీప్‌తోపాటు డాక్టర్ లీలాప్రసాద్, ప్రోగ్రాం ఇన్‌చార్జిగా డా.భవానీప్రసాద్, కోశాధికారిగా డాక్టర్ ఎం.చంద్రశేఖర్ నాయుడు, కో ఆర్డినేటర్లుగా డాక్టర్ రాజశేఖర్, డాక్టర్, సంతోష్, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక తాత్కాలిక రద్దు

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను తాత్కాలికంగా రద్దు చేసినట్లు అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం ఉండదన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మార్చి 8వ తేదీ వరకు ఈ కార్యక్రమం రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

నేడు కమిషనరేట్‌లో ...

అల్లిపురం: కమిషనరేట్‌లో కూడా సోమవారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన నడక



ప్రారంభసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా

బీచ్‌రోడ్డు: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్‌లో యునైటెడ్ బై యునీక్ వాక్‌థాన్ జరిగింది. ఆర్.కె.బీచ్ వద్ద భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వాక్‌థాన్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా మిలియన్ల మంది క్యాన్సర్‌తో చనిపోతున్నారని, ఈ సంఖ్య క్రమంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 2040 నాటికి క్యాన్సర్ కేసుల సంఖ్య 30 మిలియన్లకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం, రెగ్యులర్ స్క్రీనింగ్‌లు, కొన్ని వ్యాక్సిన్‌లు తీసుకోవడం ద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించవచ్చన్నారు. యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఫ్లాష్‌మాబ్ చేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ఆస్పత్రి ఎండీ డాక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

అదిరే అదిరే..

ఘనంగా ముగిసిన అరకు ఉత్సవ్



జై భాస్కర్ బృందం సంగీత కచేరీ



ఈజిప్షియన్ నృత్యం



మంగ్లీతో కలిసి పాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

అరకులోయ టౌన్/డుంబ్రిగుడ: ఆంధ్రా ఊటీ అరకు లోయలో నిర్వహించిన అరకు చలి ఉత్సవ్‌కు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. గత నెల 31 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం రాత్రితో ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు నిర్వహించిన వివిధ రాష్ట్రాలకు చెందిన గిరిజన కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ సినీ గాయకులు వందే మాతరం శ్రీనివాస్, మంగ్లీ గీతాలాపన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఉత్సవాల చివరిరోజు జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలకు తిలకించేందుకు అన్ని వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఉత్సవాల విజయవంతానికి ప్రణాళికపరంగా చర్యలు చేపట్టారు.

ఉత్సాహంగా ట్రెక్కింగ్

అరకు చలి ఉత్సవ్‌లో భాగంగా ఆదివారం ఉదయం సుంకరమెట్టలో నిర్వహించిన ట్రెక్కింగ్ 3కే ఉత్సాహంగా సాగింది. దీనిని విశాఖ ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ ప్రారంభించారు. సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, సబ్ డీఎఫ్‌వో ఉమామహేశ్వరి, స్వాతంత్య్ర సమరయోధుల మ్యూజియం క్యూరేటర్ పి.శంకరరావు పాల్గొన్నారు. పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధం అమలు అవుతున్న నేపథ్యంలో వారు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. పర్యాటకుల్లో చైతన్యం తెచ్చేలా ట్రెక్కింగ్ సాగింది. ప్రకృతి ఒడిలో పక్షుల కిలకిలారావాలు, కాఫీ, మిరియం గుభాళింపు, పూల సువాసన మధ్య మరపురాని మధురానిభూతి పొందామని పలువురు పేర్కొన్నారు.

రంగుల రంగోళి..

గిరిజన మ్యూజియంలో నిర్వహించిన రంగుల రంగోలి పోటీల్లో ప్రథమ స్థానాన్ని అనకాపల్లి జిల్లా వాకపల్లికి చెందిన బి. దేవి, ద్వితీయ స్థానాన్ని ఎల్. మధుశ్రీ, తృతీయస్థానాన్ని అరకు డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని వి. సునీత కైవసం చేసుకున్నారు. ప్రత్యేక బహుమతిని విశాఖ వ్యాలీ పబ్లిక్ స్కూల్‌లో ఎల్‌కేజీ విద్యార్థిని చిన్మయి సాధించారు. విజేతలకు కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా షీల్డ్, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ పోటీల్లో 32 మంది మహిళలు పాల్గొనగా వీరందరికీ ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ ఎం.జె. అభిషేక్ గౌడ, పీవో వి. అభిషేక్, డీఆర్వో పద్మలత, ఇన్‌చార్జి డీడీ రజని పాల్గొన్నారు.



మణిపూర్ కళాకారుల రాధాకృష్ణుల నృత్య ప్రదర్శన

డాక్టర్ లోకనాథానికి వ్యాఘ్రేశ్వరుడు బంగారు పతకం



అవార్డు అందుకుంటున్న డాక్టర్ లాడి లోకనాథం

మహారాణిపేట: కేజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్యుడు, ఏఎంసీ ప్రొఫెసర్ లాడి లోకనాథానికి అత్యుత్తమ వ్యాఘ్రేశ్వరుడు స్మారక బంగారు పతకం లభించింది. మోచేతి నొప్పితో బాధపడుతున్న అనేక మంది రోగులకు డాక్టర్ లోకనాథం వైద్య సేవలందించారు. దాదాపు 15 మందికి కేజీహెచ్‌లో శస్త్రచికిత్సలు చేశారు. ఈ సేవలను గుర్తించిన నలుగురు వైద్యుల కమిటీ డాక్టర్ లోకనాథానికి వ్యాఘ్రేశ్వరుడు స్మారక బంగారు పతకం ప్రదానం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు నగరంలో జరిగిన ఆర్థోపెడిక్ వైద్యుల సదస్సులో ప్రముఖుల చేతులమీదుగా ఆయన బంగారు పతకం స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకనాథంను కేజీహెచ్, ఏఎంసీ వైద్యులు అభినందించారు.

నాగావళి ఎక్స్‌ప్రెస్ ఆలస్యం: ప్రయాణికుల ఆందోళన



లోకో పైలట్‌ను ప్రశ్నిస్తున్న ప్రయాణికులు

తాటిచెట్లపాలెం : సంబల్‌పూర్ నుంచి నాందేడ్ వెళ్లాల్సిన నాగావళి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో సుమారు 3 గంటలు నిలిచిపోయింది. వాస్తవానికి ఈ రైలు విశాఖకు ఆదివారం రాత్రి 7.40 గంటలకు వచ్చి 8 గంటలకు బయల్దేరాలి. కానీ ఈ రైలు ఇక్కడకు రాత్రి 8.40 గంటలకు వచ్చి రాత్రి 11 గంటల వరకు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు లోకోపైలట్, టీటీఈల వద్దకు పరుగులు తీసి వారిని ప్రశ్నించారు. తాము సిద్ధంగా ఉన్నామని, సిగ్నల్ వస్తే బయల్దేరుతామని బదులిచ్చారు. ఈ రైలు ఆలస్యం వల్ల మిగిలిన రైళ్ల పంక్చువాలిటీకి ఆలస్యమవుతుందని, ఆ కారణంగా దీనిని నిలిపినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఎట్టకేలకు ఈ రైలు రాత్రి 11 గంటలకు విశాఖ నుంచి బయల్దేరింది.

ముగిసిన భీమిలి పాఠశాల శతాబ్ది ఉత్సవాలు



విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ




ప్రేమాభిషేకంలో పాటకు డ్యాన్స్ చేస్తున్న కోల్ ఇండియా విశ్రాంత జీఎం అప్పలరెడ్డి

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు ఆదివారంతో ఉత్సాహంగా ముగిశాయి. శనివారం ఈ ఉత్సవాలు ప్రారంభం కాగా.. రెండవ రోజు సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల మైదానంలో పూర్వ విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పలువురు పూర్వ విద్యార్థులు ఉల్లాసంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ వేదిక వద్ద సందడి నెలకొంది. భారీగా తరలివచ్చిన పూర్వ విద్యార్థులు ముచ్చట్లలో మునిగారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులను, ఆయా బ్యాచ్‌ల వారీగా పూర్వ విద్యార్థులను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 1976–79 బ్యాచ్‌కు చెందిన కోల్ ఇండియా లిమిటెడ్ విశ్రాంత జీఎం బి.అప్పలరెడ్డి ప్రేమాభిషేకం సినిమాలోని పాటకు చేసిన డ్యాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మరికొంత మంది పాటలు పాడారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ శతాబ్ది ఉత్సవాలు అందరి సహకారంతో విజయవంతమయ్యాయని ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గాదు అప్పలనాయుడు, మైలిపల్లి లక్ష్మణరావు తెలిపారు. ఇందుకు కారణమైన ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజనుల హక్కులను హరించేందుకు కూటమి కుట్ర

- 1/70 చట్టానికి తూట్లు పొడిచే విధంగా స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలు
- ఎమ్మెల్సీ, ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుంభా రవిబాబు



సాక్షి, విశాఖపట్నం : గిరిజనుల హక్కులను హరించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రకు తెరలేపుతోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుంభా రవిబాబు మండిపడ్డారు. ఆదివారం లాసన్స్‌బే కాలనీలో విలేకరులతో రవిబాబు మాట్లాడుతూ గిరిజనులకు రక్షణ కవచంలా ఉండే 1/70 చట్టానికి తూట్లు పొడిచేలా స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు చేయడం పట్ల గిరిజనులంతా మండిపడుతున్నారన్నారు.

గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఇదే ప్రయత్నం చేస్తే అప్పుడు గిరిజనులమంతా ప్రతిఘటించామని, మళ్లీ గిరిజనుల రక్షణ చట్టాన్ని హరించేందుకు కుట్రలకు పాల్పడితే సహించేది లేదంటూ హెచ్చరించారు. ఇదే జరిగితే ఆదివాసీల సంప్రదాయం, సంస్కృతి కనుమరుగయ్యే ప్రమాదం వాటిల్లుతుందని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఏజెన్సీలు 5వ షెడ్యూలు కిందకు వస్తాయని, దీన్ని ధిక్కరించే అధికారం ఏ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా లేదని పేర్కొన్నారు. ఇప్పటికే టూరిజం అభివృద్ధి పేరుతో పలు ఉల్లంఘనలు జరుగుతున్నాయని, వీటిని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. టూరిస్టుల కారణంగా ప్రభుత్వానికే ఆదాయం తప్ప.. గిరిజనులకు ఒరిగేదేమీ లేదన్నారు. ఇప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గిరిజన ప్రాంతాలు 1/70ను సవరిస్తే మరింత వెనుకబడిపోతాయని, తక్షణం ఇలాంటి ఆలోచనలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో డెలివరీ బాయ్ దుర్మరణం



సంఘటన స్థలంలో నూతన్‌కుమార్ మృతదేహం

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ గొంతినవానిపాలెం శ్రీసింహాద్రి హోటల్ ఎదురుగా ఆదివారం ఉదయం హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొని డెలివరీ బాయ్ దుర్మరణం చెందాడు. అనకాపల్లి పట్టణం గాంధీనగర్‌కు చెందిన బయ్యవరపు నూతన్‌కుమార్(23) పీఎంపాలెంలో నివాసం ఉంటున్నారు. క్రికెట్ స్టేడియం వద్ద స్విగ్గీ(ఇన్‌స్టామార్ట్) డెలివరీ బాయ్‌గా విధులు పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై అనకాపల్లి నుంచి ఆనందపురం వైపు వస్తుండగా ఈ ప్రమాదానికి గురయ్యాడు. పొగమంచు కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని తల్లి నూకేశ్వరి ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

పాడేరు : చర్చిలో ప్రార్థనల కోసం పాస్టర్‌తో కలిసి వస్తున్న ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అనకాపల్లి జిల్లా పరవాడ గ్రామానికి చెందిన పాస్టర్ మోసే తన స్నేహితుడు కాకినాడకు చెందిన జయకుమార్‌తో కలిసి పాడేరు మండలం గొందెలి పంచాయతీ వంచెడిగొంది గ్రామంలో ఉన్న చర్చిలో ఆదివారం ప్రార్థనల కోసం ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో పాడేరు-చోడవరం ప్రధాన రహదారి ఘాట్ రోడ్డులోని వంట్లమామిడి సమీపంలో మలుపు వద్ద పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్తున్న వ్యాన్ బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న విజయ్‌కుమార్ అనే యువకుడు తీవ్ర గాయాలపాలై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. వెనుక కూర్చున్న పాస్టర్ మోసేకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన మోసేను అత్యవసర వైద్య చికిత్సల నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. మృతదేహాన్ని పాడేరు జిల్లా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచి వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటనపై పాడేరు పోలీసులు కేసు నమోదు చేశారు.

మామపై అల్లుడి హత్యాయత్నం

నిందితుడికి రిమాండ్

పెందుర్తి: కుటుంబ వివాదాల నేపథ్యంలో మామపై హత్యాయత్నానికి పాల్పడిన అల్లుడిని పెందుర్తి పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా తుమ్మపాలకు చెందిన నక్కా శ్రీనివాసరావు శనివారం రాత్రి అప్పన్నపాలెంలోని తన అత్తవారింటికి వచ్చాడు. కుటుంబ గొడవల నేపథ్యంలో శ్రీనివాసరావు, అతని మామ దేవరపు జోగారావు మధ్య తీవ్రస్థాయిలో వివాదం జరిగింది. ఈ క్రమంలో శ్రీనివాసరావు తన మామ జోగారావుపై కత్తితో దాడి చేశాడు. జోగారావు చేతిపై గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడ్ని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.